ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సహకార రంగం పరిరక్షణకు...

ఉత్తరాంధ్ర సంఘటితం కావాలి

ప్రయివేట్ లాభాల కోసమే విద్యుత్ సంస్కరణల బిల్లు

రైతులు, కార్మికులు ఐక్యమై తిప్పికొట్టాలి

'వ్యవసాయరంగం-సహకార సంఘాల పాత్ర' సెమినార్‌లో వక్తల ఉద్ఘాటన



సెమినార్‌లో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి కాలనీ

ఉత్తరాంధ్రలో వ్యవసాయ రంగం ప్రధానంగా సహకార రంగంపై ఆధారపడి ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా ఈ రెండు రంగాల నడ్డి విరుగుతుందని ఉత్తరాంధ్ర ప్రాంతంలోని రైతులు, కార్మికులూ సహకార వ్యవస్థ రక్షణకు భవిష్యతులో సంఘటితోద్యమం నిర్వహించాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. బుధవారం ఉదయం 11 గంటలకు 'వ్యవసాయ రంగం-సహకార సంఘాల పాత్ర' అన్న అంశంపై ఎపి రైతు సంఘం, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో ఎపి రైతు సంఘం పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో వ్యవసాయ రంగం చాలా సంక్షోభంలో ఉందన్నారు. సహకార రంగంలో రుణాలిచ్చే బ్యాంకులు, డెయిరీలు, చక్కెర ఫ్యాక్టరీలు, విద్యుత్ సంస్థలన్నిటినీ ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పంటలు, వ్యవస్థలూ దెబ్బతింటున్న క్రమంలో సహకార రంగాన్ని పునర్నిర్మాణం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వ్యవసాయ, సహకార రంగాలను ముగ్గురు మాయల మరాఠీలకు అప్పగించే యత్నాలు సాగుతున్నాయని విమర్శించారు. సహకార రంగంలో అమూల్, వ్యవసాయ రంగంలో అదానీ, విద్యా రంగంలో బైజూస్ వంటి పెద్ద పెద్ద ప్రైవేట్ సంస్థలు, పెద్ద కంపెనీలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయని ఎద్దేవా చేశారు.

సహకార వ్యవస్థపై నిర్లక్ష్యం: వి.కృష్ణయ్య

ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడంలో విఫలమైందన్నారు. గుజరాత్‌లోని అమూల్‌కి అప్పగించడం చూస్తే సహకార వ్యవస్థను ఏపిలో దెబ్బతీసే చర్యలు ఆరంభం అయినట్లేనని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా కేరళ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా ఉన్న పాడి పరిశ్రమను అర్బన్ ఉపాధి పథకంలోకి మార్చి ప్రత్యేక శ్రద్ధతో పాల రంగాన్ని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉందన్నారు. రెండు ఆవులు లేదా రెండు గేదెలు పెంచుకుని రోజుకు పది లీటర్ల చొప్పున వందరోజుల పాటు ఉత్పత్తి చేస్తే రూ.32వేలు అదనంగా చెల్లించేలా పథకాన్ని అక్కడ రూపొందించారని తెలిపారు. మన రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం గుజరాత్ కంపెనీలో మన పాడి పరిశ్రమను కలిపేసే యత్నాలకు దిగి రైతులను

మిగతా 2లో..

నత్తనడకన పాఠశాలల నిర్మాణం

నిధులు, ఇసుక సమస్యతో ముందుకుసాగని పనులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో నాడు-నేడు రెండో దశ పాఠశాలల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది జులైకి పనులు పూర్తిచేస్తామని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, నిధుల కొరతతో వచ్చే ఏడాదికి పెంచింది. ప్రస్తుత నిధులు విడుదల, సామాగ్రి కొరతతో ఆనాటికైనా పూర్తయ్యేలా కన్పించడంలేదు. జిల్లాలోని 616 పాఠశాలల్లో 1015 ప్రాజెక్టులను మూడు భాగాలుగా ప్రభుత్వం విభజించింది. 616 పాఠశాలల్లో 8,692 పనులకుగానూ రూ.260 కోట్లు విడుదల చేయాల్సివుంది. కానీ ప్రభుత్వం... ఇప్పటివరకు రూ.50 కోట్లు విడుదల చేయడంతో పనులు వేగంగా జరగడంలేదు. 8692 పనులకు 3,761 పనులు మొదలయ్యాయి. పనులన్నీ ప్రారంభించేందుకు విడుదల చేసిన నిధులు సరిపడాలేకపోవడం, ఇసుక సమస్య ఉండడంతో పనులు ఆశించినట్లు ముందుకుసాగడంలేదు. రెండో దశలోని నాడు-నేడు తొలి ప్రాజెక్టులో ఎనిమిది రకాల పనులు చేయాల్సివుంది. వీటిలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, చిన్న, మధ్యతరహా మరమ్మతులు, పాఠశాలలకు రంగులు, ఇంగ్లీష్ ల్యాబ్, గ్రీన్‌చాక్ బోర్డు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సివుంది. రెండో ప్రాజెక్టులో అదనపు తరగతులు నిర్మించాల్సివుంది. ఒక్కొక్క అదనపు తరగతి గదికి రూ.13 లక్షలు చొప్పున ప్రభుత్వం వాటిని కట్టాల్సివుంది. జిల్లాలో 302 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. మూడో ప్రాజెక్టు కింద పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాల్సివుంది. 616 పాఠశాలల్లో 68 అంగన్‌వాడీ భవనాలు, 19 జూనియర్ కాలేజీలు కూడా ఉన్నాయి. ఇంతవరకు రూ.40 కోట్ల విలువైన పనులు జరిగాయి.



గదులు చాలక బుదిరెడ్లపాలెంలోని సామాజిక భవనంలో నిర్వహిస్తున్న తరగతులు

తరగతుల విలీనంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగిన గదులు లేకపోవడంతో ప్రభుత్వం అదనపు తరగతి గదులు మంజూరుచేసింది. అయితే వాటిని సకాలంలో పూర్తిచేసేలా నిధులు విడుదలచేయకపోవడంతో ఉన్న గదుల్లోనే విద్యార్థులు సర్దుకోవాల్సివస్తోంది. అధికారులు మాత్రం నిర్దేశిత గడువులోగా పనులు పూర్తవుతాయని చెబుతున్నారు. నిర్మాణ సామాగ్రి మినహా మిగిలిన మౌలిక సదుపాయాలకు సంబంధించిన సామాగ్రిని ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

మత్స్యకార నిర్వాసితుల సమస్యలు పట్టవా?

వార్త మెయిన్ 3లో..

9వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు

వార్త 8లో..

విజయానికి స్వయంసాధన అవసరం

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు



ఇంటరాక్టివ్ సెషన్‌లోమాట్లాడుతున్న కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే స్వయంసాధన, కఠోర శ్రమ అవసరమని పోటీ పరీక్షల నిపుణులు, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోటీ పరీక్షల ఇంటరాక్టివ్ సెషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక మార్కు సైతం జీవితాన్ని నిర్దేశిస్తుందన్న విషయం గుర్తెరిగి అత్యధిక మార్కులు కైవసం చేసుకునేలా ప్రణాళికతో సన్నద్ధం కావాలన్నారు. కేవలం పుస్తకాలను బట్టీ పట్టడం కాకుండా విశ్లేషనతో చదవాలని సూచించారు. చుట్టూ జరిగే సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకోసం వార్తా పత్రికల అధ్యయనం చాలా అవసరమని తెలిపారు. సిలబస్‌ను అర్థం చేసుకోవడం, పాత ప్రశ్నాపత్రాలను పరిశీలించడం, పరీక్షకు అనుగుణంగా కాన్సెప్ట్ సిద్ధం చేసుకోవడం ద్వారా విజయానికి చేరువ కావచ్చని చెప్పారు. కొన్ని స్టాండర్డ్ బుక్స్ మాత్రమే అనుసరించి వీలైనన్ని ఎక్కువ రివిజన్‌లు చేయాలని సూచించారు. అనంతరం పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాల జాబితాను విద్యార్థులకు తెలిపారు. అభ్యర్థులు అడిగిన సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టడీసర్కిల్ సమన్వయకర్త కె.అభిమన్యు, బోధనా సిబ్బంది డాక్టర్ రామునాయుడు, ఒ.రామకృష్ణ, డాక్టర్ ప్రియాంక విద్యార్థులు పాల్గొన్నారు.

కనీసవేతనంపై ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు, అసంఘటితరంగ కార్మికుల ఉపాధిరక్షణ కోసం ఐక్య పోరాటాలకు కార్మికులంతా సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. ఎంవిపి గిరిజన భవనంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ 9వ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభంలో సీనియర్ నాయకులు ఎస్.మాధవస్వామి జెండాను ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్షవర్గంగా వి.కృష్ణారావు, కె.కుమారి, జెఆర్.నాయుడు వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తలు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కుమార్‌మంగళం మాట్లాడుతూ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న ప్రభుత్వం మాటతప్పిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనం ఇవ్వాలని ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.6వేల నుంచి రూ.12వేలు మాత్రమే చెల్లించి దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. కాంట్రాక్టర్ల వ్యవస్థ వల్ల కార్మికులు అనేక హక్కులు కోల్పోతున్నారన్నారు. కనీసవేతనాల బోర్డు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాలు కాంట్రాక్టర్లకు ప్రత్యక్షంగా సహకరించడాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేనలు పల్లెత్తుమాట కూడా మాట్లాడటం లేదన్నారు. కార్మికుల హక్కుల సాధనకోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.



మహాసభలో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

మహాసభలో కార్యదర్శి పి.వెంకటరావు మూడేళ్లలో నిర్వహించిన పోరాటాలు-విజయాలపై నివేదిక ప్రవేశపెట్టారు. మహాసభ కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించింది. మహాసభ ప్రారంభానికి ముందు గత మూడేళ్ళ కాలంలో మరణించిన కార్మికవర్గ నాయకులకు, ప్రజాస్వామ్యవాదులకు సభ ఘనంగా నివాళులర్పించింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జెఆర్.నాయుడు (మున్సిపల్), పి.వెంకటరావు, ఆఫీస్ బేరర్స్‌గా రామారావు (ఆర్‌టిసి), బి.కృష్ణ (ముఠా), వరలక్ష్మి (జివిఎంసి), ఎ.సింహాచలం (తోపుడుబండ్లు), సిహెచ్ పార్వతి (హాస్పిటల్స్), ఆలీ (ఆటో) ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

మొదటి పేజీ తరువాయి..

సహకార రంగం పరిరక్షణకు... ఉత్తరాంధ్ర సంఘటితం కావాలి

మభ్యపెడుతుందని ఎద్దేవా చేశారు.

ప్రయివేట్ లాభాల కోసమే: విద్యుత్ బిల్లుపై సిహెచ్ఎన్నార్

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ, 2022 విద్యుత్ సంస్కరణల బిల్లును కేంద్రం ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి వ్యవసాయాన్ని దెబ్బతీసే చర్యలకు దిగుతుందని ఎద్దేవా చేశారు. ప్రయివేట్ లాభాల కోసమే విద్యుత్ చట్టాన్ని తెచ్చారని దీన్ని దేశ వ్యాపితంగా (పార్లమెంట్‌లో కూడా) వ్యతిరేకిస్తున్నారన్నారు. దేశం, రాష్ట్రంలో విద్యుత్ రంగంలో ప్రయివేట్‌కి లైసెన్సులు ఇస్తున్నారని టాటా, అదానీలకు పవర్ సెక్టార్ మొత్తాన్ని అప్పగించే కుట్ర మోడీ చేస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో రైతులు, కార్మికులు ఈ విద్యుత్ సంస్కరణలపై ఐక్యంగా పోరాడితేనే విద్యుత్ చట్టాలను తిప్పికొట్టగలమని లేదంటే ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోతే విద్యుత్ సబ్సిడీలు ఉండవని ఆయన హెచ్చరించారు.

ఉత్తరాంధ్ర సహకార రంగానికి పెట్టింది పేరు : అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ అజశర్మ

రాష్ట్రంలోనే సహకార రంగంలో విశాఖ జిల్లాకు ప్రత్యేకత ఉందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ అజశర్మ అన్నారు. రాష్ట్రంలో 13 చక్కెర ఫ్యాక్టరీలు సహకార రంగంలో ఉంటే అనకాపల్లి జిల్లాలోనే 4 ఉన్నాయని కానీ గోవాడ ఒక్కటే నడుస్తుందన్నారు. పేరులో ఉన్న సహకారం ఈ రంగాన్ని నిలబెట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. నల్లబెల్లం నిషేధం విధించడం, ఇప్పటికే 3 ఫ్యాక్టరీలు మూతపడడం చూస్తే అనకాపల్లి ప్రాంతంలో బెల్లం మార్కెట్‌పై నెగెటివ్ ప్రభావం పడిందన్నారు. చెరకు పండించిన రైతులు ఏం చేయాలో ప్రభుత్వం చెప్పాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ, వ్యవసాయ రంగం నిలదొక్కుకోవాలంటే సహకార రంగం మద్దతు తప్పనిసరి అని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పిఎసిఎస్‌లు, జిల్లా స్థాయిలో డిసిసిబిలు, రాష్ట్ర స్థాయిలో ఆప్కాబ్‌లను నిర్వీర్యం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయ, సహకార రంగాలు సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయన్నారు. విశాఖ జిల్లా ఉద్యోగ సహకార సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకటరావు సహకార సంఘాల పరపతి, సాంకేతిక విషయాలపై ప్రసంగించారు. వేదికపై శ్రీకాకుళం జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె మోహనరావు, విజయనగరం జిల్లా కార్యదర్శి (రైతు సంఘం) బుద్ధరాజు రాంబాబు, అనకాపల్లి జిల్లా నుంచి కర్రి అప్పారావు, కాకినాడ అప్పారెడ్డి, పార్వతీపురం లక్ష్మునాయుడు ఉన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ డాక్టర్ రమాప్రభ పరిచయం

సభా వేదికపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కోరెడ్ల రమాప్రభను అతిథులు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, విశ్రీనివాసరావు, అజశర్మ, మర్రాపు సూర్యనారాయణ సెమినార్‌కు హాజరైన రైతులకు పరిచయం చేశారు. గ్రామాల్లో విస్తృతంగా ఓట్లు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి పడేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే పలు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని రమాప్రభ ఈ సందర్భంగా తెలిపారు. వ్యవసాయ, సహకార రంగాల్లో ప్రభుత్వ విధానాల వల్ల రైతులకు కలిగే నష్టంపై పెద్దల సభలో ప్రశ్నిస్తానని, రైతులకు మద్దతుగా నిలుస్తానని ఆమె తెలిపారు.

సెమినార్‌లో పలు అంశాలపై తీర్మానాలు

2023 ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే రైతు మార్చ్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలాగ చైతన్యం కలిగించే కార్యకలాపాలు చేపట్టాలని సెమినార్ తీర్మానించింది. అలాగే పలు వ్యవసాయ, సహకార సంబంధిత అంశాలపై తీర్మానాలను విజయనగరం జిల్లా రైతు సంఘం కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు సెమినార్‌లో ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. వాటిలో 1. సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని, 2. డెయిరీలలో పాల సేకరణ ధరకు, అమ్మకం ధరకు మధ్య తేడా 20శాతం ఉందని దీన్ని రైతులకు 10శాతం (లీటరుకు) పెంచాలని, 3.ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, 4.విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించవద్దని, 5.ఉచిత విద్యుత్ చట్టం చేయాలని, 6. భూ సేకరణలో రైతులకు మార్కెట్ రేటుకు 4 రెట్లు పరిహారం ఇవ్వాలని, 7.సహకార రంగాన్ని పరిరక్షించాలని తీర్మానాలు చేశారు.

ఐఎఎస్, ఐపిఎస్‌లు న్యాయబద్ధంగా వ్యవహరించాలి

మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఐఎఎస్, ఐపిఎస్‌లు రాష్ట్రానికి పిల్లర్ల వంటి వారిని, వారు న్యాయబద్ధంగా వ్యవహరించాలని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీనియర్ ఐఎఎస్ అధికారి కృష్ణబాబు అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. విశాఖలో గంజాయిని అరికట్టామని డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం అబద్ధం అన్నారు. ఎన్ని గంజాయి కేసులు నమోదు చేశారు, ఎన్నింటిని పరిష్కరించారో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ చెప్పినట్లుగా పోలీసులు పనిచేస్తున్నారని ఆరోపించారు. జగన్ పరిస్థితి డేరా బాబాలా ఉందని ఎద్దేవా చేశారు. నరసాపురం సభలో మహిళల నల్ల చున్నీలను తొలగించడం, వారిని అవమానించడం దుర్మార్గం అన్నారు. ఎపిలో 3 మెడికల్ కాలేజీలకు కేంద్రం ఆమోదం తెలిపి జీవో ఇస్తే 16 మెడికల్ కాలేజీలకు అనుమతి ఉందని చెప్పి, వాటి నిర్మాణానికి శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాటుచేయడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వంలో విద్యారంగం నాశనం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్ల కాలంలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగరాజు, జి.ఫణీంద్రకుమార్ ఆరోపించారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ఈ నెల 25, 26 తేదీలలో ఢిల్లీలో జరగనున్న పార్లమెంట్ మార్చ్‌కు విశాఖ నుండి సుమారు 15 మంది బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్య కాషాయకరణ, ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రమణ, బాబ్జి, బాలాజీ, అభి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల జగదాంబ జోన్ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జగదాంబ జోన్ కమిటీ ఎన్నికలు బుధవారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా ఎం.సుబ్బారావు, అధ్యక్షులుగా ఎం.ఈశ్వరరావు, కార్యదర్శిగా టి.నూకరాజు, కోశాధికారిగా పి.అప్పలరాజు, కమిటీ సభ్యులుగా ప్రభ, నూకాలమ్మ, కుమార్, ఈశ్వరమ్మ, లక్ష్మి, వెంకటలక్ష్మి, మంగ, రామలక్ష్మి, పైడమ్మ, రాము, ధన, నాగమణి, గోపి, పార్వతి, లక్ష్మి, అప్పారావు, నాయుడు (15 వార్డుల నుంచి) ఎన్నికయ్యారు. నైట్ ప్యాకేజీ వర్కర్స్ 24 మందితో నూతన కమిటీ ఎన్నిక కూడా జరిగింది.

సాహిత్య విస్తరణలో విశాలాంధ్ర కృషి : చలం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సాహిత్య విస్తరణలో విశాలాంధ్ర కృషి అద్వితీయమని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య కెఎస్.చలం పేర్కొన్నారు. విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర రచయితలు వెలుగులోకి రావడానికి విశాలాంధ్ర కృషి ఉందన్నారు. వేలాది రకాల పుస్తకాలు ఒకే వేదికపై లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల అప్పలరాజు, మేనేజర్ పిఎ.రాజు, మూర్తి, అనీల్ తదితరులు ఉన్నారు.

విశాఖను ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా అంగీకరించం : బిజెపి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నాన్ని ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా తాము అంగీకరించబోమని మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు అన్నారు. విశాఖపట్నంలోని బిజెపి నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రుషికొండలో నిర్మాణాలు పూర్తయిన అనంతరం జగన్మోహన్ రెడ్డి పరిపాలన ప్రారంభిస్తారని తమకు సమాచారం ఉందని, దీన్ని వ్యతిరేకిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని బ్యాంకులు, మార్కెట్లో రూ.2000 నోట్లు కనిపించడం లేదని, వాటిని ఎవరు బ్లాక్ చేశారో ఆర్‌బిఐ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నర్సాపురంలో మహిళల నల్ల చున్నీలు తీయించివేయడం సిగ్గుచేటని, బాధ్యులైన పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చిరంజీవికి నరవ అభినందనలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా తెలుగు చలనచిత్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది ఇండియన్ పనోరమలో నాలుగు తెలుగు చలనచిత్రాలు ఎంపిక అవడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్, సినిమా బండి, కుదిరంబోస్, అఖండ, సినిమాల తో పాటు ఇండియన్ క్లాసిక్ విభాగంలో శంకరాభరణం సినిమా ఎంపిక కావడం చాలా సంతోషకరమని తెలిపారు. ఈ సినిమాలను నేషనల్ ఫిలిం ఆర్క్యా ఆఫ్ ఇండియాలో భద్రపరచడం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు గర్వకారణం అని పేర్కొన్నారు.

నరసాపురంలో జరిగింది కౌరవ సభ : జనసేన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో జరిగిన సభ సిఎం సభ కాదని, కౌరవ సభను గుర్తు చేసిందని జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ ఆరోపించారు. సిఎం సభకు హాజరైన మహిళలు నల్ల చున్నీలను ధరించడాన్ని తప్పుపడుతూ తొలగించి పోలీసులు కౌరవ సభగా మార్చారని ఎద్దేవాచేశారు. దీనిని నిరసిస్తూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జనసేన మహిళా కార్యకర్తలు నల్ల వస్త్రాలను ధరించి నిరసన తెలిపారు. నరాపురం ఘటనకు బాధ్యత వహిస్తూ హోం మంత్రి వనిత, మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ తక్షణం తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, కంటపల్లి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

డిసిపిగా ఆనందరెడ్డికి ప్రమోషన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నాన్ కేడర్ ఎస్‌పిగా సేవలందిస్తున్న కె.ఆనందరెడ్డిని విశాఖ నగర కమిషనరేట్ పరిధిలో డిసిపి-2 గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఆనందరెడ్డి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పలు ప్రాంతాల్లో విశేష సేవలందించారు. ఆ తరువాత విశాఖ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసినప్పుడు అత్యధిక కేసులను ఛేదించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఆనందరెడ్డికి పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A. 72/2022 in O.S. 71/2015

Between :
Velagala Ravindranatha Reddy ...Petitioner/Plaintiff
And
Velagala Swaminatha Reddy & 8 others…Respondents/Defendants

NOTICE
(Under Section-5 of the Limitation Act)

To, **Respondent No.8:**
Velagala Buli Venkata Reddy, S/o. Late Siva Satyanarayana Reddy, V. Dhana Reddy & Co., Choncson Street, Visakhapatnam-1

Whereas the above named petitioner has fled the above I.A. seeking the Hon'ble Court to condone the delay caused in filing an application under Order -22 Rule-9 of C.P.C to set aside the order of abatement of the above suit against the deceased 2nd defendant, Velagala Siva Satyanarayana Reddy for non filing of the application under Order-22 Rule-4 of C.P.C. to add his legal representatives in the above suit and the matter stands posted to **28-11-2022** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-11-2022** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

Y. CHINNAYYA DORA, Advocate
Visakhapatnam, **Cell: 9848763339**

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A. 73/2022 in O.S. 71/2015

Between :
Velagala Ravindranatha Reddy ...Petitioner/Plaintiff
And
Velagala Swaminatha Reddy & 8 others…Respondents/Defendants

NOTICE
(Under Order-22 Rule-9 of C.P.C)

To,
Respondent No.8:
Velagala Buli Venkata Reddy, S/o. Late Siva Satyanarayana Reddy, V. Dhana Reddy & Co., Choncson Street, Visakhapatnam-1

Whereas the above named petitioner have fled the above I.A. seeking the Hon'ble Court to set aside the order of abatement of the above suit against the deceased 2nd defendant for non filing of the application under Order-22 Rule-4 of C.P.C. to add his legal representatives in the above suit and the matter stands posted to **28-11-2022** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-11-2022** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

Y. CHINNAYYA DORA, Advocate
Visakhapatnam, **Cell: 9848763339**

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A. 74/2022 in O.S. 71/2015

Between :
Velagala Ravindranatha Reddy ...Petitioner/Plaintiff
And
Velagala Swaminatha Reddy & 8 others…Respondents/Defendants

NOTICE
(Under Order-22 Rule-4 of C.P.C)

To,
Respondent No.8:
Velagala Buli Venkata Reddy, S/o. Late Siva Satyanarayana Reddy, V. Dhana Reddy & Co., Choncson Street, Visakhapatnam-1

Whereas the above named petitioner have fled the above I.A. seeking the Hon'ble Court to add you as one of the legal representatives of the deceased Velagala Siva Satyanarayana Reddy in the above suit as one of the defendants and the matter stands posted to **28-11-2022** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-11-2022** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

Y. CHINNAYYA DORA, Advocate
Visakhapatnam, **Cell: 9848763339**

సెక్షన్ 9 హిందూ వివాహ చట్టం ప్రకారం
నోటీసు
మహారాజశ్రీ చోడవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
హెచ్.ఎం.ఓ.పి.నెం.49/2022

బిట్వీన్
బొడ్డేపల్లి మోహన్ ...పిటీషనరు
మరియు
బొడ్డేపల్లిమేరీ ...రేస్పాండెంటు

టు రెస్పాండెంటు
బొడ్డేపల్లిమేరీ
భర్త మోహన్
బ్రాండెక్స్ కంపెనీ ఉద్యోగి,
తండ్రి బుంగా రాజారావు,
ఎస్‌సి కోలనీ, కొత్తకోట గ్రామం,
రావికమతం మండలం, అనకాపల్లి జిల్లా.

యిందుమూలముగా మీకు తెలియ జేయునది యేమనగా పై నెంబరు పిటిషనులో పిటిషనరు కాపురమునకు రమ్మనమని నీపై పై నెంబరు పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషను **తే.16-12-2022దీని** వాయిదా అయివున్నది. అందు విషయమై మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడలా, పై కోర్టులో తేదీని స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై తెలియజేసుకోవల్సిందిగా కోరడమైనది.

చోడవరం
తే.22-11-2022దీని
వై.వెంకటరావు
అడ్వకేటు, చోడవరం
సెల్ నెం.9440122487

దావా సమను
మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 401/2019

Between:
దాసరి సత్తిబాబు **-వాది**
AND
గంపా సోమరాజు **-ప్రతివాది**
To:
గంపా సోమరాజు, S/o. నూకరాజు, 41 సం॥లు, ఉద్యోగం, డోర్ నెం. 4-424, ఎంపిపి స్కూల్, తొత్తరమూడి, చింతపల్లి మండలం, విశాఖపట్నం జిల్లా, చింతపల్లి DMC. **-ప్రతివాది**

పై నెంబరు దావా గ్రంథమునకు సంబంధించి ప్రతివాది యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 21-12-2022 వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
టి.వి.నారాయణరెడ్డి
వాది తరపు అడ్వకేట్, అనపర్తి
సెల్: 9849484239

రిజిస్టర్డ్ పోస్టు ద్వారానే ఆర్‌టిఐ సమాచారం



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర సమాచార కమిషనర్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోనిపలు ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్ర సమాచార కమిషనర్ యు హరిప్రసాద్ రెడ్డి బుధవారం సందర్శించారు. తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాచార చట్టం ద్వారా పత్రాలను రిజిస్టర్ పోస్ట్ ద్వారా మాత్రమే అందించాలన్నారు. ఆర్డినరీ పోస్ట్ చేయకూడదన్నారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లను సందర్శించి రికార్డులను పరిశీలించారు. తహశీల్దార్ లోకవరపు రామారావు, డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్, ఎంపిడిఓ లవరాజు, పరిపాలన అధికారి నాగేశ్వరరావు, ఎస్ఐ నరసింహమూర్తి ఉన్నారు.

నిత్యాన్నదానానికి బియ్యం వితరణ



బియ్యం బస్తాలు అందజేస్తున్న సినీ హీరో కంచర్ల ఉపేంద్ర

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్ భక్తతుకారం ఆలయంలో అయ్యప్ప మిత్రబృందం ఆధ్వర్యంలో అయ్యప్ప, భవానీ దీక్షాపరులకు నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి బుధవారం ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు, ఎస్ఎస్ఎల్ క్రియేషన్స్ సంస్థ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు 20 బస్తాల బియ్యాన్ని వితరణగా అందజేసారు. సినీ హీరో కంచర్ల ఉపేంద్ర పాల్గొని వీటిని అందజేశారు.

సివిల్స్ పరీక్షలకు సన్నద్ధతపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులకు బుధవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. హౌ టు ప్రిపేర్ ఫర్ సివిల్ సర్వీసెస్ అనే అంశంపై సర్వ శిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సివిల్ సర్వీసెస్ అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె విద్యాసాగర్, ఐక్యుఎసి కో ఆర్డినేటర్ ఎం.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రోన్ల సాయంతో సమగ్ర భూసర్వే

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని టి నగరపాలెం, బోడమెట్టపాలెం గ్రామాల్లో బుధవారం డ్రోన్ల సాయంతో సమగ్ర భూసర్వే నిర్వహించారు. తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ మాట్లాడుతూ, టి నగరపాలెంలో 407 ఎకరాలు, బోడమెట్టపాలెంలో 670 ఎకరాల సర్వే జరపనున్నట్లు వివరించారు. ప్రతి భూకమతాన్ని సర్వే జరిపి, అత్యంత కచ్చితత్వంతో అక్షాంశాలు, రేఖాంశాలు, విశిష్ట గుర్తింపు సంఖ్య, సమగ్ర భూ వివరాలు తెలిపే విధానాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు పొట్నూరు ఛాయా గౌతమి,ముద్దాడ అప్పయ్యమ్మ, ఎంపిటిసి పల్లా నీలిమ, చెల్లూరి నగేష్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉత్సాహంగా జరిగాయి. అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికల ఎంపిక పోటీలు జరిగాయి. హెచ్‌ఎం జిడికె భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.వెంకటరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కోట సతీష్, ఎ.అప్పలరాజు పాల్గొని, పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి జిల్లా ఎంపికలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు తెలిపారు.

వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలి

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి వైటి దాస్



మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు నేత వైటి దాస్

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులకు వేతనం ఒప్పందం వెంటనే అమలు చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి వైటి దాసు డిమాండ్ చేశారు. బుధవారం ఉక్కు నగరం సిఐటియు కార్యాలయంలో ఎస్ఎంఎస్-2 మహాసభలో మాట్లాడుతూ గత అక్టోబర్‌లో ఎన్‌జెసిఎస్ సమావేశంలో క్లాజ్- 8 కారణంగా విశాఖ ఉక్కులో నూతన వేతనాలు అమలు కాకుండా ప్రస్తుత గుర్తింపు యూనియన్ అడ్డుపడిందన్నారు. ఫలితంగా సెయిల్‌లో నూతన ఒప్పందంతో ఇప్పటికే కార్మికులు కొత్త వేతనాలు పొందుతున్నా, విశాఖ ఉక్కులో అమలు జరగలేదన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.అప్పారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు 650 రోజులుగా కార్మికుల ఆందోళన చేస్తున్నా కేంద్రంలో కదలిక లేదని, రాష్ట్రంలోని 25మంది ఎంపిలు రాజీనామా చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో యు.రామస్వామి, బి తౌడన్న, యు మరిడయ్య ,పూర్ణచంద్ర పాల్గొన్నారు. అనంతరం.ఇ. శ్రీనివాసరాజు డాంబికరావు, బి.అప్పలరాజు, జిసిహెచ్. చినఅప్పారావు, ఉదయ భాస్కర్, కొండలరావు, మరో 80 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

25న ధర్నా విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఈఎస్ఐ హాస్పిటల్ సమస్యల పరిష్కారానికి ఈ నెల25న బీసీ గెట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వివి. రమణ పిలుపునిచ్చారు. బుధవారం ఉక్కు నగరంలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ కాంటాక్ట్ కార్మికుల దగ్గర నుండి నెలకు కోటి రూపాయలు ఇఎస్ఐ బోర్డుకి చెల్లిస్తున్నారని, అయినా కార్మికులకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. ఈఎస్ హాస్పిటల్‌లో సరైన ఔషదాలు లేవని, రిఫరల్ హాస్పిటల్‌కు బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో అక్కడ రోగుల్ని సరిగా పట్టించుకోకపోవడం లేదన్నారు. దీనిపై విజయవాడలోని ఇఎస్ఐ బోర్డు డైరెక్టర్లు కలిసి సమస్యలు విన్నవిస్తే, రాష్ట్ర ప్రభుత్వంవైపు చూపడం దుర్మార్గమన్నారు. తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంటాక్ట్ లేబర్ యూనియన్ సిఐటియు నాయకులు చీకటి శ్రీనివాస్, బంధం రాము,డి.లక్ష్మి, రాము, రామ్ నాయుడు, శ్రీను. తదితరులు పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరణలో మాట్లాడుతున్న సిఐటియు నేత రమణ

ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

25న స్టీల్‌ప్లాంట్ బిసి గేటు వద్ద చేపట్టే ధరానకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను కాంట్రాక్టు లేబర్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యాన. ఎల్ఎంఎంఎం పార్కు వద్ద ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు ఒవి రావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇఎస్ఐ నిర్వీర్యమౌతోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు. నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, డి.పాండే, బి కన్నబాబు, ఆర్‌టి రాజు పాల్గొన్నారు.

ఒటిఎస్ ద్వారా పట్టాలిప్పించాలి



గడపగడపలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-ఆనందపురం : శొంఠ్యాం పంచాయతీ నీలకుండీలు వైఎస్ఆర్ కాలనీలో ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న 250మంది లబ్ధిదారులకు ఒటిఎస్‌ద్వారా పట్టాలిప్పించి ఆదుకోవాలని గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. నీలకుండీలు జంక్షన్, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి విద్యార్థి సంఘం నాయకుడు రైతు శ్రీని ఆధ్వర్యంలో స్థానికులు విన్నవించారు. ఇటీవల ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశమిచ్చినప్పటికీ సంబంధిత స్థలం రెవెన్యూ రికార్డుల్లో గెడ్డవాగుగా ఉండడంతో అభ్యంతరాలు తలెత్తాయని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి, తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రామారావును ఆదేశించారు.

ఈ సందర్భంగా శ్రీను ఆర్థికసాయంతో సమకూర్చిన వంద వైసిసి టీ షర్టులను ధరించిన యువకులు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా పాల్గొన్నారు.వీరిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అభినందించారు. కాలనీలో రోడ్డు, డ్రైనేజీల సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టికి విన్నవించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, వైసిపి నేతలు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు,బంక సత్యనారాయణ, మజ్జి వెంకట్రావు, లంక రాంబాబు, రౌతు శ్రీను, కోరాడ ముసలి నాయుడు, బంక మహేష్, కోరాడ రమణారావు, పల్ల దుర్గ పాల్గొన్నారు.

గొంతివానిపాలెంలో ఆరునెలలుగా రక్షితనీటి పథకం నుంచి వృథాగా పోతున్న తాగునీటి సమస్యను, అలాగే రోడ్డు విస్తరణతో తలెత్తిన డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు విన్నవించారు. వైసిపి నేతలు బంక సత్యన్నారాయణ, బలిరెడ్డి మహేష్, బలిరెడ్డి రమేష్ బాబు, రౌతు వెంకట్రావు, ఎంపిడిఒ లవరాజు, ఎలక్ట్రికల్ ఎఇ సురేష్ కుమార్ పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమునిపట్నం : జివిఎంసి రెండు, నాలుగు వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. రెండో వార్డులో రూ.20 లక్షలతో రోడ్లు, కాల్వల నిర్మాణాలు, నాలుగో వార్డు కె.నగరపాలెంలో జివిఎంసి సాధారణ నిధులు రూ 44.60 లక్షలతో రోడ్లు, కాల్వల నిర్మాణ పనులకు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ 20లక్షలతో కాపులుప్పాడ సచివాలయ పరిధిలోనూ, కె.నగరపాలెంల పరిధిలో రూ.17.85లక్షలతో తాగునీటి పైపులైన్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, ఎపి యాత కార్పొరేషన్ డైరెక్టర్ బి రాములప్పడు, జెడ్‌సి ఎస్ వెంకటరమణ, వైసిపి నేతలు ఎస్ కరుణాకర రెడ్డి, వంశీరెడ్డి పాల్గొన్నారు. చిట్టివలస జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రూ100.16 లక్షల నాడు నేడు నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, పిఎసిఎస్ అధ్యక్షుడు రామునాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో కార్మికురాలు మృతి



మృతదేహం వద్ద వామపక్షాల ఆందోళన, ఇన్‌సెట్లో మృతురాలు పార్వతి

ప్రజాశక్తి- మధురవాడ : పిఎం పాలెంలోని బహుళ అంతస్తుల భవనంలో నిర్మాణ పనులు చేస్తున్న పిండి అప్పనమ్మ అలియాస్ పార్వతి (40) అనే కార్మికురాలు బుధవారం ఉదయం విద్యుదాఘాతంలో మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీ, బ్లాక్ నెంబర్30లో జిఎఫ్8లో ఇద్దరు పిల్లలతో నివాసముంటున్న అప్పన్నమ్మ, భర్త మరణంతో ఇంటికి పెద్దదిక్కుగా, జీవనాధారంగా కూలిపనులు చేస్తుండేది. అందులో భాగంగానే పిఎంపాలెంలో పనులకు వెళ్లి అక్కడ విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది.దీంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. దీనిపై పిఎం పాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

పిఎం పాలెం: విద్యుదాఘాతంలో మృతి చెందిన అప్పనమ్మ అలియాస్ పార్వతి కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం, సిఐటియు, సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనాస్థలిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మికురాలు అప్పన్నమ్మ మృతికి సంబంధిత బిల్డింగ్ యజమాని రిజ్వా నిర్లక్ష్యం,భద్రత పాటించక పోవడం కారణమని ఆరోపించారు. బాధిత కుటుంబానికి తగు న్యాయపరిహారం ఇచ్చి ఆదుకోవాలని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు, సిఐటియు జోన్ నేతలు పి.రాజ్‌కుమార్, వి.సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

బీచ్‌లో యువకుడి మృతదేహం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మూడవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఆర్‌కె.బీచ్, కాళీమాత టెంపుల్ ఎదురుగా తీరానికి బుధవారం సాయంత్రం యువకుడి మృతదేహం కొట్టుకు వచ్చింది. దీనికి సంబంధించి త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం... సుజాత నగర్‌కు చెందిన నౌపాడ లోకేష్ (17) గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రోజులానే బుధవారం కాలేజీకి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి అని చెప్పి కళాశాల నుంచి వెళ్లిపోయాడు. లోకేష్ మృతదేహం బీచ్‌కు కొట్టుకు రావడంతో తలిదండ్రులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. లోకేష్ తండ్రి మోహనరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

పేదల సొంతింటి కల సాకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి-వేపగుంట : పేదల సొంతింటి కల నెరవేరేందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు బుధవారం వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సిఎం జగన్ పాదయాత్రలో గుర్తించిన సమస్యల మేరకు విడతలవారీగా అందరి సమస్యలను పరిష్కరిస్తూ,సంక్షేమ పథకాలను చేపడుతున్నారన్నారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి ఇల్లులు మంజూరు కాలేదని, ఆ సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. జెడ్‌సి మల్లయ్య నాయుడు , ఎంపిడిఒ, వైసిపి నేతలు పాల్గొన్నారు

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుగా లక్ష్మి



గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా మండలంలోని గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి ఎన్నికయ్యారు. ఈనెల 17,18,19 తేదీలలో విజయవాడలో బాలోత్స భవనంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సర్పంచుల సదస్సులో ఈ మేరకు ఎన్నిక జరిగింది. రాష్ట్రంలో పంచాయతీ సర్పంచ్‌ల్లో దాదాపు 80శాతం మంది వైసిపి, 18శాతం మంది టిడిపి, ఇతరులు రెండు శాతం మంది గెలిచినప్పటికీ, సర్పంచ్‌ల సంఘం రాష్ట్రాధ్యక్షురాలిగా టిడిపికి చెందిన గంభీరం సర్పంచ్ లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. లక్ష్మి భర్త వానపల్లి ముత్యాలరావు (ఈశ్వరరావు) 2006 నుండి 2011 వరకు రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. సర్పంచుల సమస్యలు హక్కులపై వానపల్లికి విశేష అనుభవం ఉండడంతో ఇపుడు లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

సిఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ కల్యాణి



జగన్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న కల్యాణి

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీకాకుళం పర్యటనకు వెళుతూ విశాఖ విమానాశ్రయంలో ట్రాన్సిట్ హాల్ట్ చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖ రాజకీయ అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు

కాంగ్రెస్ పాదయాత్ర జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మూల వెంకటరావు

ప్రజాశక్తి మాధవధార : దేశంలో బిజెపి చేస్తున్న అక్రమాలు, ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలను తరిమి కొట్టాలని రాహుల్‌గాంధీ భారత జోడో యాత్ర చేపట్టారని, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో అనంతపూర్ నుండి శ్రీకాకుళం వరకు కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించిందని ఎపిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. బుధవారం నగరంలోని రైల్వే న్యూకాలనీలోని సింక గ్రాండ్ హోటల్‌లో కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి సెల్ చైర్మన్ మూల వెంకటరావు మాట్లాడుతూ జోడు యాత్ర స్ఫూర్తితో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉత్తరాంధ్ర రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల ఎజెండాతో అన్ని జిల్లాల్లో పాదయాత్ర చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎపిసిసి సెక్రటరీ రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, రాష్ట్ర ఎస్‌సి సెల్ చైర్మన్ వినయ్‌కుమార్, పిసిసి జనరల్ సెక్రెటరీ జి.వి.నారాయణరావు, ట్రైనింగ్ సెల్ చైర్మన్ డోల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవిందరాజు పాల్గొన్నారు.

ఘనంగా సూరిబాబు జన్మదిన వేడుకలు



పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న అభిమానులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 70వ వార్డు వైసిపి నేత, ఎల్‌బి.నగర్ అధ్యక్షులు కెవి సూరిబాబు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అభిమానులు కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

మున్సిపల్ కార్యకలాపాలు శతశాతం విజయవంతం

జివిఎంసి ఐదో జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ



ఐదో జోన్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి ఐదవ జోన్‌లోని అన్ని వార్డుల్లో మున్సిపల్ కార్యకలాపాలు శతశాతం విజయవంతంగా సాగుతున్నాయని ఐదో జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ తెలిపారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో ప్రజాశక్తి ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రశ్న: జోన్ పరిధిలో శానిటేషన్‌పై తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: జగనన్న సత్య సంకల్పం (క్లాప్) కింద 118 ఆటోలతోపాటు జివిఎంసికి చెందిన 51, ఒ అండ్‌ఎం వాహనాలు 18, స్వీపింగ్ వాహనాలు నాలుగున్నాయి. దాదాపు 1100 మంది వర్కర్లు ఉన్నారు. ఉదయం పూట ఇంటింటా చెత్తసేకరణ, మధ్యాహ్నం డ్రైనేజీల క్లీనింగ్, రోజూ ఏదో ఒక వార్డులో పారిశుధ్యంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎంతమంది సిబ్బంది వస్తున్నారు. ఏయే ప్రాంతాల్లో పనిచేస్తున్నారో క్లీన్‌మానటరింగ్ చేస్తున్నాం. ప్రతి రోజూ ఏదో ఒక వార్డులో పర్యటిస్తూ అక్కడి సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఇళ్ల వద్దే చెత్తను విభజించే విధంగా శానిటేషన్ సెక్రటరీలను 100శాతం గార్బేజ్ సాగరికేషనల్ జరిగే విధంగా పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నాం. స్పందన, వాట్సాప్, జివిఎంసి ప్రత్యేక మానిటరింగ్ సెల్, ఇతర మార్గాల్లో అందిన ఫిర్యాదులు, వినతులపై వెనువెంటనే స్పందించి పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: జోన్‌లో ఇంజినీరింగ్ కార్య కలాపాలు ఎలా సాగుతున్నాయి?

జవాబు: ఇప్పటివరకు 25 వార్డుల్లో నిర్వహించిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై సచివాలయానికి కేటాయించిన రూ.20లక్షల నిధులతో ఆయా వార్డుల్లో కౌన్సిల్ ఆమోదించిన పనులకు, ప్రజావసరాలకు ప్రాధాన్య తనిచ్చి నిధులు కేటాయించి, 50శాతం ప్రాంతాల్లో పనులు ప్రారంభించాం.. మిగిలినవి కూడా అతి త్వరలో ప్రారంభిస్తాం. చేపట్టిన పనులకు సంబంధిత కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నాం.

ప్రశ్న: హౌసింగ్ విభాగం పనులు ఎలా సాగుతున్నాయి?

జవాబు: గృహ నిర్మాణానికి సంబంధించి ఐదో జోన్‌లో ఇప్పటివరకు 19 వేలమందిని సెంటు భూమి ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించాం. వీరిలో మొదటి విడతలో 65శాతం మందికి ఇప్పటికే ఇళ్లపట్టాలను అందజేశాం. ఆరువేలు టిడ్కో ఇళ్లను కేటాయించగా, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీలలో ప్రజలు ఇప్పటికే ఇళ్లల్లో చేరారు. '22ఎ' సమస్య కారణంగా ముత్యమాంబ కాలనీలలో ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉంది. కలెక్టర్ నుంచి ఆదేశాలు రాగానే 196 మందికి ఇళ్ల పంపిణీ చేస్తాం. ఎవరైతే ఇంకా ఫ్రీ కాన్స్ట్రక్షన్ ఆక్టివిటీస్ అనగా జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్, మ్యాపింగ్ వంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయో వాటిని త్వరలోనే పరిష్కరించి, మిగిలిన లబ్దిదారులకు పట్టాలను అందజేస్తాం.

ప్రశ్న: టౌన్ ప్లానింగ్ విభాగంలో కార్యకలాపాలు ఎలా సాగుతున్నాయి ?

జవాబు : ఇళ్ల ప్లానింగ్ విషయంలో 1డీమ్డ్ అప్రూవల్ కాకుండా ముందుగానే అక్కడికి వెళ్లి సర్వే జరిపించి చర్యలు చేపడుతున్నాం. ఏవైతే అనధికార నిర్మాణాలు ఉన్నాయో వాటికి ముందస్తు నోటీసులు ఇచ్చి అనంతరం చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే లీగల్‌గా చర్యలకు సన్నాహకాలు చేస్తున్నాం. ఇప్పటికే మూడు అనధికార నిర్మాణాలు కూల్చేశాం. భవిష్యత్తులో కూడాఅనధికార నిర్మాణాలపై చర్యలు కొనసాగుతాయి. దీనికోసం టౌన్ ప్లానింగ్ లో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ప్లానింగ్ సెక్రటరీ ల ద్వారా చర్యలు చేపడుతున్నాము.

ప్రశ్న : పన్ను వసూళ్ళ ఎలా ఉన్నాయి ?

జవాబు: జోన్‌లోని అన్ని వార్డులలో పన్ను వసూళ్లలో మంచి పురోగతి సాధించాం.. పాత బకాయి ఇప్పటికే 50 శాతం వరకు వసూలు చేశాం. ప్రస్తుత బకాయిలను 65శాతం దాక వసూలు జరిగింది. రాబోయే రెండు మూడు మాసాల్లో శతశాతం పన్ను వసూళ్లకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

కెకె.రాజు విజయానికి సమిష్టిగా కృషి చేద్దాం

ముడసర్లోవ పార్కులో వైసిపి ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి

ప్రజాశక్తి- సీతమ్మధార :గడచిన ఎన్నికల్లో ఓటమి పాలైనా, వెనకడుగువేయకుండా అనునిత్యం నియోజకవర్గ ప్రజల మధ్యలోనే ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజాదరణ పొందుతున్న కెకె.రాజును ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏడాదిన్నర ముందే సిఎం జగన్ ప్రకటించడం అభినందనీయమని పలువురు వైసిపి నేతలు అన్నారు. బుధవారం ముడసర్లోవ పార్కులో ఉత్తర నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గ అభ్యర్థిగా కెకె.రాజును ప్రకటించిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ కేడరంతా సమిష్టిగా కృషి చేసి, కెకె.రాజును మంచి మెజార్టీతో గెలిపించుకుని, ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామని నిర్ణయించారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, విశాఖ ఎంపి ఎంవివి. సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌ఎ.రెహ్మాన్, పంచకర్ల రమేష్‌బాబు, తైనాల విజయ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్లు సీతంరాజు సుధాకర్, చొక్కాకుల లక్ష్మీవెంకటరావు, కాయల వెంకటరెడ్డి వైసిపి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌ఎడబ్ల్యుపిసిఎ సదస్సులో

కాశీ విశ్వేశ్వరరావు



సదస్సులో పాల్గొన్న కాశీవిశ్వేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖపట్నం : మాల్దీవులలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ అండ్ వెస్టన్ పసిఫిక్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌ఎడబ్ల్యుపిసిఎ) 45వ కన్వెన్షన్‌కు మన రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్‌చైర్మన్, జనరల్ కౌన్సిల్ మెంబర్ ఎ.కాశీవిశ్వేశ్వరరావు, జనరల్ కౌన్సిల్ మెంబర్ టి.భాస్కరరావు హాజరయ్యారు. ఈ కన్వెన్షన్‌లో 19 దేశాల ప్రతినిధులు పాల్గొని, తమ దేశాల్లో నిర్మాణరంగంలో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, అమలు చేస్తున్న నూతన పరిజ్ఞానం, భవిష్యత్తులో నిర్మాణ రంగంలో ఆయా దేశాల్లో ఉన్న అవకాశాలపై విపులంగా చర్చించారు.

దేదీప్యమానంగా అనంతుని దీపోత్సవం

దీపాల వెలుగులో కాంతులీనిన పద్మనాభుని కొండ

వేకువజాము నుంచే భారీగా తరలివచ్చిన భక్తులు

వాహన రాకపోకలపై ఆంక్షలతో పలువురి అవస్థలు



దీపోత్సవంతో వెలిగిపోతున్న పద్మనాభుని కొండ

ప్రజాశక్తి -పద్మనాభం: ఏటా కార్తీక అమావాస్య రోజున నిర్వహించే పద్మనాభంలోని స్వయంభూ అనంత పద్మనాభస్వామి దీపోత్సవాన్ని బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. వేకువజామున నాలుగు గంటలకే కొండపై ఉన్న దేవాలయంలో అనంతుని శంకు. చక్ర నామాల వద్ద, అలాగే కొండ దిగువనున్న కుంతీమాధవస్వామి ఆలయంలోనూ, అలాగే మాధవస్వామికి ఎడమ భాగంలో ఉన్న లక్ష్మీదేవి ఆలయాల్లోనూ ఆలయ పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున అక్కడికి చేరుకున్న భక్తులు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు కుంతీమాధవస్వామి ఆలయంలో శ్రీదేవి,భూదేవి సమేతుడైన అనంతుని ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గాలిగోపురం నుంచి కొండ తొలిమెట్టు వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గరుడ వాహనంపై ఊరేగింపుగా తీసుకెళ్ళి,అక్కడ కొబ్బరి మట్టలతో సిద్ధం చేసిన పందిళ్లలో ప్రతిష్ఠించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అశోక్‌గజపతి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శుభముహూర్తం ప్రకారం సాయంత్రం ఐదున్నర గంటలకు కొండపైన జేగంట మోగిన వెంటనే అప్పటికే కొండమెట్లపై ఇరువైపులా కూర్చున్న భక్తులంతా ఒకేసారి దీపాలను వెలిగించారు. దీంతో అమావాస్య చిమ్మచీకట్లలోనూ అనంతపద్మనాభుని కొండ, దీపోత్సవాల వెలుగులో దేదీప్యమానంగా వెలిగిపోయింది. అదే సమయంలో కొండపైకెళ్లే మెట్ల మార్గానికి ఇరువైపులా ఏర్పాటుచేసిన బాణాసంచా పేలుళ్ళు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అనంత పద్మనాభుని దీపోత్సవాన్ని పురస్కరించుకుని వేలసంఖ్యలో వచ్చే భక్తుల తాకిడి దృష్ట్యా ఉదయం ఎనిమిది గంటల నుంచే ఘాట్‌రోడ్డు మార్గంలో కొండపైకి వాహనరాకపోకలపై పోలీసులు ఆంక్షలు విధించారు..వృద్దులు, చిన్నపిల్లలకు దాతల సాయంతో మంచినీరు, ప్రసాద వితరణ చేపట్టారు. రేవిడి పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. మీసేవ కేంద్రాలు, ఇటుక బట్టీల యజమానులు, ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల దంపతులుఅనంతపద్మనాభుని దర్శించుకున్నారు. మద్ది జంక్షన్‌లో త్రిలోక్ ల్యాబ్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రదీప్, చైతన్య, శివాజీ పాల్గొని, రోగులకు బిపి, సుగర్, ఇతర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇచ్చారు.

చిరు వ్యాపారుల నిరాశ

దీపోత్సవానికి వచ్చిన భక్తులకు అవసరమైన పూజాసామగ్రి, ఇతర వస్తువులతో రెండు రోజులముందే రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టిన చిరు వ్యాపారులు ఎసిపి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు వాటిని తెరవనీయకుండా ఆంక్షలు పెట్టడంతో నిరాశకు గురయ్యారు.

ఎన్‌టిపిసి ప్రమాద బాధితుడిని ఆదుకోవాలని ఆందోళన

- ★ కంపెనీ ఎదుట బైఠాయించిన కాంట్రాక్టు కార్మికులు
- ★ దిగొచ్చి డిమాండ్లకు అంగీకరించిన యాజమాన్యం



ఎన్‌టిపిసి ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలో ఐదు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడి విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మునగపాక మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన దలాయి రాంబాబును ఆదుకోవాలని కోరుతూ ఆ కంపెనీ ఎదుట బుధవారం భారీ ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులు ఉదయం 7.30 గంటల నుంచే కంపెనీ ఎదుట బైఠాయించి ఎవరినీ లోపలకు వెళ్లనీయకుండా నిలుపుదల చేశారు. వీరి ఆందోళనకు సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఎన్‌టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌టిపిసిలో కాంట్రాక్టు కార్మికులతో స్కిల్ పనులు చేయించడం, ప్రమాదాలు జరిగితే పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.

అనంతరం హెచ్‌ఆర్ డిపార్టుమెంట్ అధికారులు చర్చలు జరిపారు. ఆందోళనకారుల డిమాండ్ మేరకు బాధితుడు చికిత్స పొందుతున్న కాలమంతా వేతనంతో కూడిన సెలవులు, తరువాత పని ఒత్తిడి లేకుండా జనరల్ షిఫ్ట్ డ్యూటీ ఇవ్వడానికి, మెరుగైన వైద్యం అందించడానికి యాజమాన్యం అంగీకరించింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఉదయం 11 గంటల సమయంలో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పైలా పోతి నాయుడు, లీడర్ రమణ, ఎం.సత్యనారాయణ, వెంకటాపురం గ్రామ సర్పంచ్ సుందరపు తాతాజీ, వెంకటాపురం గ్రామస్తులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



దుర్గాప్రసాద్‌తో పాఠశాల ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కక్కల దుర్గా ప్రసాద్ ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖపట్నం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో దుర్గా ప్రసాద్ 200 మీటర్ల రన్నింగ్, 400 మీటర్ల రన్నింగ్, డిస్కో త్రోబాల్ పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చంద్రశేఖర్ బుధవారం విలేకరులకు తెలిపారు. అద్భుత ప్రతిభ కనబర్చిన దుర్గాప్రసాద్‌ను, ఆయన శిక్షణ వచ్చిన పిడి టి.నాగేశ్వరరావును హెచ్‌ఎం చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం.పాండురంగరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



స్కాలర్ షిప్‌లు అందజేస్తున్న సాగర్ సిమెంట్ ప్రతినిధులు

మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు

ప్రజాశక్తి-కశింకోట : బయ్యవరం సాగర్ సిమెంట్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో, కీర్తిశేషులు సమ్మిడి వీరారెడ్డి స్మారక మెరిట్ స్కాలర్ షిప్ అవార్డులను 2021-22 సంవత్సరంలో మండలంలోని 13 జెడ్పీ హైస్కూళ్లలో పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 39 విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ అవార్డుల కింద ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు తహశీల్దారు బి.సుధాకర్, ఎంఈఓ కె.చిట్టిబాబు చేతులు మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జామి మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్ సిమెంట్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, సంజీవరెడ్డి, ఎజిఎంలు ప్రసాద్‌బాబు, గోపిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ సంతోష్ కుమార్, జి పాండురంగారావు, ప్రధానోపాధ్యాయులు స్వర్ణ కుమారి, మనసాన రమణశ్రీ, సుమా మణి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ళ మాణిక్యం, కస్తూరిబా పాఠశాల సూపరింటెండెంట్ చంద్రకళ పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటికి అశ్విని ఎంపిక



ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో కాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన అప్పికొండ అశ్విని ట్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు ఆ ప్రధానోపాధ్యాయులు కె.రామలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్విని పదవ తరగతి పరీక్షల్లో 557 మార్కులు సాధించింది. ఈమెకు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఒంగోలు విద్యా కేంద్రంలో సీటు కేటాయించారు. అశ్వినిని గ్రామ సర్పంచ్ పీలా నర్సింగరావు, విద్యా కమిటీ చైర్మన్ అప్పికొండ ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో పారిశుధ్యంపై బుధవారం ప్రత్యేక కార్యక్రమం బుధవారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి గ్రామంలో పర్యటించి పారిశుధ్య చర్యలపై పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చి, వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామానికి అదనపు పారిశుధ్య సిబ్బందిని, అదనంగా మరో ట్రాక్టర్ మంజూరు చేయాలని డిపిఒకు పంచాయతీ పాలకవర్గం విన్నవించింది. ఈ కార్యక్రమంలో జిల్లా సంపద కేంద్రం కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఇఒపిఆర్‌డి ధర్మారావు, పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

జీవాల పెంపకందారుల సమస్యలపై వినతి



వినతి పత్రం ఇస్తున్న గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో గొర్రెలు, మేకలకు ప్రభుత్వం నాణ్యమైన డి వార్మింగ్ నాలుగుసార్లు, వ్యాక్సినేషన్ రెండుసార్లు సకాలంలో వేయాలని గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం నాయకులు బుధవారం పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంట శ్రీరామ్, కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, ఉపాధ్యక్షులు పివి ఆంజనేయులు, సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ సకాలంలో మందులు, వ్యాక్సినేషన్ ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు పదివేల జీవాలు మృత్యువాత పడ్డాయని తెలిపారు. గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నా అవసరమైన మందులు లేకపోవడంతో జీవాలకు చికిత్స అందడం లేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేలాది పశు వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. 50 శాతం రాయితీతో రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని, సీజనల్ వ్యాధులను నివారించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో మృత్యువాత పడిన జీవాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు జీవాల నిబంధన తొలగించి ఒక జీవం చనిపోయిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 559, 1016 జీవోల ప్రకారం జీవాలకు మేత స్థలం కేటాయించాలని, 100 శాతం రాయితీతో విత్తన పొట్టేళ్లు సరఫరా చేయాలని, 50 సంవత్సరాలు దాటిన పెంపకందారులకు పింఛను ఇవ్వాలని, రాత్రి బస నిమిత్తం షెడ్లు నిర్మించాలని, పెంపకం దారుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని, అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

వాలంటీర్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని ఖాళీగా ఉన్న మూడు వాలంటీరు పోస్టులకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌడువాడలో రెండు, ఆనందపురంలో ఒక పోస్టుకు ఈ నెల 24, 25 తేదీల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

దేవరాపల్లి : మండలంలో ఖాళీగా ఉన్న ఐదు వాలంటీరు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో జివి.రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్శింగి పంచాయతీలో ఒకటి, రైవాడలో రెండు, వేచలంలో ఒకటి, కొత్తపెంటలో ఒకటి ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు 2020 జనవరి 1 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. 26న దరఖాస్తులను పరిశీలిస్తామని, 27న ఇంటిమేషన్, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, 28న ఎంపిక కాబడిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు.

తాళ్లపాలెంలో 'వైఎస్‌ఆర్ పొలం బడి'

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గ్రామంలో వైఎస్‌ఆర్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న మాట్లాడుతూ వరిపంటల్లో చీడపీడలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జి సన్యాసినాయుడు, రైతులు గొన్నాబత్తులు గంగాధర్, చిన్ని కోటేశ్వరరావు, మట్టా నూకినాయుడు, పొన్నం శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ



ట్రాన్స్‌ఫార్మర్ మార్చుతున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

'ప్రమాద భరిత విద్యుత్ వైర్లను పట్టించుకోరా?' శీర్షికన ఈ నెల 22న మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని దిబ్బిడి తురకవాని చెరువు గట్టుపై విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని ప్రజాశక్తి కథనంలో ప్రస్తావించింది. దీంతో వడ్డాది విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం నుండి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. బుధవారం రోడ్డు పై నుండి వేలాడుతున్న విద్యుత్ వైర్లకు తొలగించారు. గట్టుకు ఒక్కవైపున గల ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో వైపునకు మార్చారు. స్తంభాలను ఏర్పాటు చేసి ఆ స్తంభాలపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. రోడ్డుపై విద్యుత్ వైర్లు వేలాడకుండా ఏర్పాట్లు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో వరి పండించే రైతాంగానికి ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ భవాని, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్టీ లోకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం అవగాహన కల్పించారు. జిల్లాలో వరి నాట్లు ఆలస్యం కావడం వల్ల వరి పూత దశ నుంచి గింజ ఏర్పడే దశలో ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు కారణంగా వరి పూత దశలో మానేపుండు తెగులు ఆశిస్తుందని, దీని నివారణకు ప్రొపికొనజోల్ ఒక మిల్లీలీటర్ లేదా కార్బన్డజం ఒక గ్రాము లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ తిరుమల రావు, సపోర్టర్ ఆర్.వెంకట రాము, 10 మండలాలకు చెందిన 90 మంది రైతులు పాల్గొన్నారు.

ఎంవిఆర్ దంపతుల మహా చండీయాగం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో మహా చండి యాగం, మహాన్యాస యాగం, రుద్రాభిషేకం నిర్వహించారు. వడ్లపూడి ముత్యాల గార్మెంట్స్ కంపెనీలో బుధవారం కార్తీక మాసం బహుళ అమావాస్యను పురస్కరించుకొని లక్ష్మీనారాయణ, శివపార్వతులకు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. నవగ్రహ నక్షత్ర చండీ హోమం, చతుర్విధ పారాయణం, నవగ్రహ మండపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ తనయులు రాజేష్ బాబు, సతీష్ బాబు, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



యాగం చేస్తున్న ఎంవిఎస్ కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న సర్పంచ్ నూకరాజు

వాడ్రాపల్లిలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల స్థాయి విద్యా, వైద్యానికి ప్రదర్శన ప్రధానోపాధ్యాయులు రత్నరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఈ ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య, వైజ్ఞానిక అంశాల పట్ల శ్రద్ధ చూపిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఎల్లపు గోవిందరావు, ఉపాధ్యాయులు లలితాంబ వెంకటరాజు, శేషుకుమారి, గౌరి, పద్మావతి వెంకటరమణ, కుమార్ రాజా, గోవిందు, శ్యామల దేవి, సూర్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచాయితీ కార్మికుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి పడ్డ జీతాలను తక్షణమే చెల్లించాలని జిల్లా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్ష కార్యదర్శులు పలివెల చిన్నారావు, ములకలపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ వర్కర్లకు ఆరు నెలల నుంచి 20 నెలల వరకు జీతాల బకాయిలు ఉన్నాయన్నారు. జీతాలు విడుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటన చేసి 40 రోజులు కావస్తున్నా నేటి వరకు ఇవ్వలేదన్నారు. నెలకు రూ.3వేలు నుంచి రూ.6 వేలు వరకు ఇస్తున్న జీతాలు కూడా చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు ఆర్థకలితో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి అప్పారావు, కమిటీ సభ్యులు అనకాపల్లి ఈశ్వరమ్మ, ఒమ్మి నాగేష్, రావాడ కనక మహాలక్ష్మి, ఉప్పాక లోకేష్, పార్వతి, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన రూ.8,600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని, తక్షణమే ఆ నిధులను విడుదల చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి పాలనంతా దోచుకోవడం, దాచుకోవడమేనని ఎద్దేవా చేశారు. నిధులు లేమితో గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడిందని, దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సిదిరెడ్డి శ్రీనివాసరావు, పచ్చికూర రాము, మరపురెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

అమ్మతపురంలో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అమృతపురం, గొల్లలపాలెం గ్రామాల్లో వరి పంటలో దిగుబడిని అంచనా వేయడానికి పంట కోత ప్రయోగాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు చేయటం వల్ల దిగుబడిని అంచనా వేసుకోవచ్చని, పంటలకు ఏమైనా నష్టం వాటిల్లితే ఉచిత పంటల బీమా వర్తింపజేయడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యనారాయణ, ఆర్ఐ వీరయ్య, ఎవిఓ రమాదేవి, అమృతపురం విహెచ్ఎ భావన, హెచ్‌డిఎఫ్‌సి ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



వరి ధాన్యం తూకం వేస్తున్న అధికారులు

కలపకు నడకలు నేర్పిన కౌన్సిలర్

- కూరగాయల మార్కెట్ కూల్చినప్పటి కలప మాయం? - స్పష్టమైన సమాధానం ఇవ్వని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-యలమంచిలి

అత్యంత విలువైన కూరగాయల మార్కెట్ స్థలాన్ని అభివృద్ధి చేసి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి మున్సిపల్ ఆదాయం పెంపు లక్ష్యంతో చట్టవిరుద్ధంగా మార్కెట్ షాపుల్ని 2018లో కూలగొట్టారు. మార్కెట్ వ్యాపారులు హైకోర్టుకు వెళ్లి ఇది చట్ట విరుద్ధమంటూ వాదిస్తే అందులో కీలక పాత్ర పోషించిన నాటి మున్సిపల్ కమిషనర్ కనకరాజు సస్పెండయ్యారు. ఇదొక కథ. షాపులను కూలిగొట్టిన సమయంలో కూరగాయల షాపుల కలపను కొత్తగా నిర్మించిన మున్సిపల్ ఆఫీసులో భద్రపరిచారు. ఈ ఏడాది ఆగస్టు నెలలో కొత్త కార్యాలయం ముస్తాబు సమయంలో అక్కడ దాచిన కలప మాయమైంది. దీని గురించి కార్యాలయ సిబ్బంది ఎవర్ని ప్రశ్నించినా సరైన జవాబు రాలేదు.

విలువైన కలప కావడంతో దాని గురించి ప్రజాశక్తి పరిశోధించగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది చేసిన లీకుల మూలంగా తేలిన అంశం ఏమిటంటే ఒక మున్సిపల్ కాంట్రాక్టర్ ట్రాక్టర్లలో కలపంతా తరలించినట్లు తెలిసింది. అది కూడా ఒక కౌన్సిలర్ ఆదేశాలతో జరిగిందంటున్నారు. అది కాస్తా పోలీసులు ఏర్పాటు చేసిన సిసి కెమెరాల్లో కూడా నమోదైనట్లు భోగట్టా. కలప మాయమైన విషయమై మున్సిపాలిటీలో ఎవర్ని ప్రశ్నించినా సరైన జవాబు చెప్పడం లేదు. అయితే ఎర్రవరం సంపు ప్రాంగణంలో కొంత కలప ప్రజాశక్తి దృష్టికి వచ్చింది. ఇక్కడకు ఎలా వచ్చిందని అక్కడ పనిచేసే వారిని ప్రశ్నించగా అక్కడకు తరలించిన కౌన్సిలర్ పేరు విస్పష్టంగా చెప్పారు. మిగిలిన కలప గురించి వాకబు చేయగా ఆ కౌన్సిలర్ చైర్మన్‌గా ఉన్న పాఠశాల మధ్యాహ్న భోజనం తయారీదార్లకు అందజేసినట్లు తెలిసింది. కోర్టు కేసులో ఉన్న కలప తరలింపు సంగతి న్యాయ నిపుణుల్ని ప్రశ్నించగా అది ముమ్మాటికీ క్రిమినల్ చర్య అని పేర్కొన్నారు. కలప మాయమైన సంగతి మరెక్కడకు దారి తీస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



ఎర్రవరం సంపులో ఉంచిన కలప (ఫైల్‌ఫోటో)

మున్సిపల్ ఇంజనీర్ వీరయ్య వివరణ

ఇదే విషయమై మున్సిపల్ ఇంజనీర్ వీరయ్యను వివరణ కోరగా..., కలప తరలించిన సంగతి వాస్తవమేనని, సంపు ప్రాంతంలో కొంత, బస్టాండ్ ఓవర్‌హెడ్ ట్యాంకు కిందనున్న తాళం వేసిన స్టాక్ రూమ్‌లో కొంత సరకు ఉందని తెలిపారు. ఓవర్‌హెడ్ ట్యాంకు స్టాక్ రూమ్ పరిశీలించగా ఎటువంటి కలప లేకపోవడం కొసమెరుపు.

నెంబర్ ప్లేట్లు లేకుండా దర్జాగా తిరుగుతున్న లారీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం మండలంలో నెంబర్ ప్లేట్లు లేకుండా లారీలు, బెంజ్ లారీలు దర్జాగా తిరుగుతున్నాయి. కొన్ని లారీలకు నెంబర్ ప్లేట్ ఉన్నా ఆ నెంబర్ కనిపించకుండా రంగు పులుముతున్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగే లారీలు వల్ల ఎప్పుడైనా ప్రమాదం సంభవిస్తే ఆ లారీని గుర్తుపట్టడం ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వాహనాల రద్దీ కారణంగా అనకాపల్లి-అచ్యుతాపురం రహదారిలో ఇప్పటికే పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. నెంబర్ ప్లేట్ ఉంటే ప్రమాదం జరిగినప్పుడు చూసిన వ్యక్తి ఫలానా నెంబర్ గల లారీ అని ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుంది. నెంబర్ లేని పక్షంలో ఏ లారీపై ఫిర్యాదు చేయాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. నెంబర్ ప్లేట్ లేని ఇటువంటి లారీలు అచ్యుతాపురం జంక్షన్ మీదుగా తిరిగినా రవాణాశాఖ అధికారులుగాని, పోలీసులుగాని వాటిపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లారీ యజమానులు ముందు జాగ్రత్తగానే నెంబర్ ప్లేట్ లేకుండా లారీలు తిప్పుతున్నట్లు తెలుస్తోంది. చిన్నపాటి ద్విచక్ర వాహనమైనా నెంబర్ ప్లేట్లు ముందు వెనక లేకపోతే పోలీసులు అడ్డగిస్తున్నారని, అలాంటిది పెద్దపెద్ద లారీలు సైతం నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు వీటిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న లారీ

నిబంధనలకు లోబడే క్వారీలను నిర్వహించాలి

ప్రజాభిప్రాయ సేకరణలో మార్టూరు గ్రామస్తులు

ప్రజాశక్తి-అనకాపల్లి

గనుల శాఖ నిబంధనలకు అనుగుణంగా క్వారీలను నిర్వహించాలని, అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మార్టూరు గ్రామ ప్రజలు స్పష్టం చేశారు. మండలంలోని మార్టూరు సర్వే నెంబర్ 1లో మెసర్స్ రవితేజ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రెండు హెక్టార్లలో క్రషర్ అనుమతులకు కోరుతూ దరఖాస్తు చేసింది. దీనిపై బుధవారం డిఆర్ఓ వెంకటరమణ, పర్యావరణ శాఖ అధికారి ఖాదర్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించి క్వారీ లారీలను రవాణా చేసుకోవాలన్నారు. గ్రామంలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, 20 పడకల ఆసుపత్రి నిర్మించాలని, సిఎస్ఆర్ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ప్రభుత్వ భూములు, సూక్ష్మ నీటి వనరుల ఆక్రమణ జరిగితే చర్యలు తీసుకుంటామని డిఆర్ఓ వెంకటరమణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరణం నాయుడు, ఎంపిటిసి మిద్దె రాజా చంద్రరావు, కరణం నాగేశ్వరరావు, దంట్ల త్రిమూర్తులు, అల్లం దుర్గారావు, కరణం వెంకట నాగేశ్వరరావు మాట్లాడారు.

సమర్థవంతంగా చెరకు క్రషింగ్‌కు కృషి

ప్రజాశక్తి - దేవరాపల్లి : గోవాడ చక్కెర కర్మాగారంలో ఈ ఏడాది చెరకు క్రషింగ్ సమర్థవంతంగా చేయడానికి కృషి చేస్తున్నామని, అందుకు రైతులు సహకరించాలని సుగర్ ఫ్యాక్టరీ చెరకు అభివృద్ధి అధికారి శ్రీరాము కోరారు. మండలంలోని బి.కింతాడ వద్ద నూతనంగా నిర్మించిన చెరకు కాటా వద్ద బుధవారం ఆయన రైతులతో మాట్లాడారు. చెరకు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ అన్నం రాము నాయుడు, సర్పంచ్ బూరె బాబురావు, కోన శీను, ఏవో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో ముద్దుర్తి సంగమేశ్వర ఆలయం వద్ద శారదా నదిలో సోమవారం గల్లంతైన అనకాపల్లి మండలం బట్లపూడికి చెందిన విద్యార్థి కె.లోవరాజు మృతదేహం బుధవారం లభ్యమైంది. ఫైర్ డిపార్టుమెంట్ సహకారంతో మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక సిఐ శ్రీనివాసరావు, ఎస్సై నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ సచివాలయాన్ని సందర్శించిన డిఆర్ఓ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామ సచివాలయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది అందిస్తున్న సేవలు, ఓటిఎస్ డాక్యుమెంట్లు, ఓటర్ల జాబితాపై బిఎల్ఓ సిబ్బందికి సూచనలు చేశారు. బయోమెట్రిక్ పనితీరును పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి ఈశ్వరరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఈ-క్రాప్‌తో ప్రయోజనాలు

ప్రజాశక్తి -యలమంచిలి రూరల్ : రైతులు ఈ -క్రాప్ చేయించుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి 20, 21 వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులలో రుణాలకు ఇన్సూరెన్స్ కోత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, ఎంపిపి బొద్దపు గోవిందు, కౌన్సిలర్లు దాసరి కుమార్, దుంగ అచ్యుతరావు, వైసిపి నాయకులు బొద్దపు ఎర్రయ్య దొర పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ చేపట్టాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతి ప్రక్రియ చేపట్టాలని డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కెఎస్ఎస్.సాయిప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన డిటిఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు, బదిలీలపై కాలయాపన చేయడం తగదన్నారు. అనంతరం మండల శాఖ ఎన్నిక జరిగింది. సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మారిశెట్టి వెంకటప్పారావు, కొల్లి రాజు, ఉపాధ్యక్షులుగా విసిహెచ్.పార్వతి, కార్యదర్శులుగా దోని నూకరాజు, కుండల చిరంజీవిరావు, జిల్లా కౌన్సిలర్‌గా జి.మధు ఎన్నికయ్యారు.

కంటి పరీక్షలు శత శాతం పూర్తి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో విద్యార్థులకు నూరు శాతం కంటి పరీక్షలు పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ ఆదేశించారు. స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రిలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రథమ సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటి జాగ్రత్తల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. నేత్రదానంపై స్వచ్ఛంద సంస్థల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. కమిటీ కన్వీనర్ డాక్టర్ రమణ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 50 పాఠశాలల్లో 13,395 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 2,158 మందికి కాటరాక్ట్ ఆపరేషన్ చేశామని తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా 94,494 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి 33,313 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్, సభ్యులు డాక్టర్ కామేశ్వర గుప్తా, డిపిఆర్ఓ సాయిబాబా, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి వేణుగోపాల్, పుష్పశ్రీ ఆసుపత్రి ప్రతినిధి ఎంఎస్ రాజు, హైమ ఆసుపత్రి ప్రతినిధి ప్రసాద్, నీరుకొండ ఆసుపత్రి ప్రతినిధి వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చోడపల్లిలో చోడమాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద అయ్యప్ప స్వామి మాలాధారణ చేసిన స్వాములకు అన్నదాన కార్యక్రమం బుధవారం జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ ఆర్థిక సహాయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ తన చేతుల మీదుగా స్వాములుకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మోటూరు శ్రీవేణి, వడిసెల సన్యాసినాయుడు, అగ్గాల భాస్కరరావు, పప్పల దిలీప్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సమగ్ర భూ సర్వే

నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి జయరాం

ప్రజాశక్తి-కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి జయరాం సూచించారు. బుధవారం ఆయన కోటవురట్ల తహసిల్దార్ కార్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భూ సర్వే, జగనన్న కాలనీ తదితర వివరాలపై సంబంధిత అధికారుల నుండి ఆరా తీశారు. జగనన్న కాలనీ నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో సిబ్బందితో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్ర శేఖరు, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు ఆక్రమిస్తే జైలు శిక్ష తప్పదు

ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: అసైన్డ్ భూములను ఆక్రమిస్తే ఆరు నెలల వరకు జైలుశిక్ష, 2 వేలు వరకు జరిమానామా తప్పదని ఆర్‌డిఒ జయరాం ప్రకటనలో తెలిపారు. అసైన్డ్ భూములను లబ్ధిదారుల వారసులకు మాత్రమే అనుభవించే హక్కు కలదని అన్నారు. పీవోటీ చట్టం ప్రకారం - 1977 అసైన్డ్ భూములను ఎవరైనా ఆక్రమించినా, కొనుగోలు చేసినా ఆర్నెళ్ల జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం సాగు చేసుకునేందుకు, లేదా ఇంటి నిర్మాణానికి ఇచ్చిన భూమిని అసైన్డ్ భూమిగా పేర్కొంటారని, ఈ భూమిని లబ్ధిదారు వారి వారసులు వారసత్వంగా అనుభవించడానికి మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఇతరుల పేర్ల మీదికి బదలాయించడం, అమ్మడం, దానం చేయడం, కౌలుకు ఇవ్వడం నిషేధమన్నారు. ఒకవేళ ఎవరైనా అసైన్డ్ భూములను కొన్నా ఈ చట్టం ప్రకారం వారికి ఎలాంటి హక్కులు దఖలు పడవని, ప్రభుత్వం ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవచ్చునన్నారు. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్టప్రకారం నేరమని తెలిపారు. అసైన్డ్ భూమి అని కోర్టు తేల్చినా, ఆక్రమణలు కొనసాగిస్తే శిక్షార్హం అవుతుందని. కోర్టు గరిష్ఠంగా ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.2000 వరకు జరిమానా లేదా రెండు శిక్షలు కలిపి వేయవచ్చని తెలిపారు.



కోటవురట్లలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పలు గ్రామాల్లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. బుధవారం తహసీల్దార్ సుబ్రమణ్యం శాస్త్రికు భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేశారు. మండలంలోని చీడిక, చందనాడ, డిఎల్ పురంలో ఇనాం, ప్రభుత్వ భూములను కొంతమంది మధ్యవర్తులు అన్యాక్రాంతం చేస్తున్నట్లు ఆరోపించారు. సాగు భూములకు సంబంధించి నిజమైన లబ్ధిదారులను పక్కనపెట్టి, అనర్హుల పేరిట రికార్డును సృష్టించి భూములను కాజేయాలని చూస్తున్నారని అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, వాస్తవ లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. చీడిక గ్రామంలో ఇనాం భూములకు సంబంధించి 30 ఎకరాల భూమికి 10 పది మంది పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, పూర్తిస్థాయిలో రికార్డులు అందుబాటులో లేనందున, ఉన్నత స్థాయి అధికారులకు నివేదించినట్లు తెలిపారని ఆయన అన్నారు.



వినతిపత్రం ఇస్తున్న వీసం

జనసేనపై సిఎం వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:మత్స్యకార దినోత్సవ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌డ్డి జనసేన పార్టీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నర్సాపురం సభలో ముఖ్యమంత్రి తన ప్రసంగంలో జనసేన పార్టీని రౌడీ పార్టీగా అభివర్ణించడం సరికాదన్నారు. రౌడీలు, గుండాలు వైసిపిలోనే ఉన్నారని తెలిపారు. విశాఖలో చేస్తున్న దోపిడీలు తదితర విషయాలను బయట పెడుతున్నామన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలపై పోరాడుతున్నామన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించి ప్రజాహిత పరిపాలన సాగించాలని హితవు పలికారు.

సిబ్బంది కొరతపై ప్రత్యేక దృష్టి

తహసిల్దారు జానకమ్మ



ప్రజాశక్తి-కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తహసిల్దారు జానకమ్మ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వే, పెండింగ్ ఫైల్స్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సహా 7 గ్రామాల గ్రామ రెవెన్యూ అధికారులు, 4సచివాలయ సర్వేయర్ల కొరతపై చర్యలు తీసుకుంటామన్నారు.

సత్యసాయి బాబా జయంతి సందర్భంగా

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నంలో సత్య సాయి బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున నగర సంకీర్తనతో ప్రారంభించి కుంకుమ పూజలు, సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. సత్య సాయి ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 7000 మందికి అన్నదానం చేశారు. వికలాంగులకు, యాచకులకు వస్త్రధానం చేశారు.

గొలుగొండ:ఏజెన్సీ లక్ష్మీపురం గ్రామంలో బుధవారం పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలను స్థానిక సత్యసాయి భజన మండలి సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక షిరిడిసాయి ఆలయంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. వృద్ధులకు గ్రామీణ బ్యాంకు మేనేజర్ వై.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు.

నక్కపల్లి:మండలంలోని నక్కపల్లి, వేంపాడు గ్రామాల్లో సత్యసాయి జయంతి వేడుకలను నిర్వహించారు .నక్కపల్లి లో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కొత్త భగవాన్ ఇంటివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు అన్న సమారాధన చేపట్టారు.

కె.కోటపాడు : సత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలు మండలంలోని లంకవానిపాలెం గ్రామ సర్పంచి వేచలపు దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారి నగర సంకీర్తన ప్రారంభమైంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్న సమారాధన చేపట్టారు.



గొలుగొండ మండలంలో దుస్తులు అందజేస్తున్న సభ్యులు

దేవరాపల్లి : సత్యసాయి జయంతి వేడుకలు దేవరాపల్లిలో ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బాలవికాస్ చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల ఇన్‌ఛార్జి సిహెచ్ రవిశంకర్, కన్వీనర్ కెవి శంకర్రావు, ఆధ్యాత్మిక విభాగం సమన్వయకర్త రమణ మూర్తి, శ్రీను, ప్రభాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మాడుతూరు గ్రామంలో సాయిబాబా జయంతి సందర్భంగా 130 మంది నిరుపేదలకు దుప్పట్లు, చీరలు, ఐదు కేజీలు బియ్యం చొప్పున పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఎం.మోటూరు సంజీవి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ జువ్వల నాయుడు, ఉపసర్పంచ్ చిన్ని గోవిందా, విశ్రాంత విఆర్‌ఓ కెవిఆర్ ప్రసాద్, సాయిబాబా సేవా సమితి ప్రతినిధులు పెంటపాటి సోమరాజు, పాండురంగారావు, దాసరి అచ్చియ్య నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

పాఠశాలల్లో కొత్త మెనూ అమలు

ప్రజాశక్తి-నక్కపల్లి:పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని కొత్త మెనూ ప్రకారం అందించాలని ఎంఈఓ డివిడి ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుండి కొత్త మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలన్నారు. తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కొత్త మెనూ అమలు చేయకపోతే చర్యలు తప్పదని హెచ్చరించారు.

హెల్త్‌అసిస్టెంట్‌లను రిలీవ్ చేయండి

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలో బదిలీ అయిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను రిలీవ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రాంత వైద్య ఆరోగ ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం పాడేరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు శెట్టి నాగరాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను డిప్లయ్మెంట్ చేసి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా చూడాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, దీని ప్రకారంగా ఉమ్మడి జిల్లా విశాఖ పట్నం ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లను మూడు దపాలుగా కౌన్సిలింగ్ అయిన పిమ్మట ఆర్డర్స్ జారీ చేశారని, నేటికీ 20 రోజులు గడుస్తున్నా అల్లూరి సీతారామరాజు జిల్లాలో హెల్త్ అసిస్టెంట్లకు రిలీవింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్క హెల్త్ అసిస్టెంట్ రెండు నుంచి ఆరు వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లో విధులను నిర్వహించే విధంగా మ్యాపింగ్ చేయగా, గిరిజన ప్రాంతం ప్రత్యేకతల దృష్ట్యా ఒక్కో హెల్త్ అసిస్టెంట్‌కి ఒక్క వైయస్సార్ హెల్త్‌క్లినిక్ మాత్రమే ఇచ్చారన్నారు. హెల్త్ అసిస్టెంట్లు కౌన్సిలింగ్ ద్వారా బదిలీ అయినచోట విధులు నిర్వహించాలో లేక గతంలో పని చేసిన చోట చేయాలో ఇప్పటికీ అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వక పోవడంతో గందరగోళ పరిస్థితిని ఎదుర్కొం టున్నారని చెప్పారు. కౌన్సిలింగ్ ప్రకారంగా హెల్త్ అసిస్టెంట్లకు బదిలీ అయిన చోట ఆర్డర్స్ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ కాన్సెప్ట్‌లో విధి నిర్వహణ చేసుకునేలాగా అవకాశం కల్పించవలసిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు.

వికలాంగుల పింఛన్లపై సర్వే

సదరం సర్టిఫికెట్లు పరిశీలన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వికలాంగుల పింఛన్లపై బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్ సర్వే నిర్వహించారు. ప్రధానంగా సదరం సర్టిఫికెట్ లేని వారిని తొలగిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అయితే అటువంటి వ్యక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో సదరం కేంద్రాన్ని ఏర్పాటు చేసి అర్హులందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తకోట:

వికలాంగుల పింఛన్లపై జరుగుతున్న సమగ్ర పరిశీలనలో భాగంగా బుధవారం రావికమతం మండలం దొండపూడిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఈవోఆర్‌డి సంజీవ రమణయ్య మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 89 వికలాంగ పింఛన్ దారులు ఉండగా, 54 పింఛన్‌ల పరిశీలన చేశామని తెలిపారు. ఈ పరిశీలనలో సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో ప్రస్తుతం పొందుతున్న పింఛన్ ఐడి, వ్యక్తి గత ఫోటో సేకరణ తదితర అంశాలను ప్రభుత్వం ఇచ్చిన యాప్ ద్వారా నమోదు చేస్తూన్నామని ఆయన వివరించారు. మండల వ్యాప్తంగా పింఛన్ పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.రాజారావు, సచివాలయ కార్యదర్శి దాలి నాయుడు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



దొండపూడిలో సర్వే చేస్తున్న ఇఒపిఆర్‌డి

9 వరకు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు

ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 23న ఓటు హక్కు వివరాల జాబితా విడుదల కానుందని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. ఆ జాబితా వచ్చిన తర్వాత ఓటు హక్కు నమోదు చేసుకున్న వారి వివరాలు పరిశీలించుకోవచ్చునని పేర్కొన్నారు. ఇప్పటికీ నమోదు చేసుకొని వారు ఎవరైనా ఉంటే ఈ నెల 23వ తేదీ నుంచి డిసెంబర్ 9 వరకు రెండో విడతలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఓటు హక్కు కోసం ఫొటో, ఆధార్ కార్డ్, డిగ్రీ సర్టిఫికెట్, అడ్రస్, ఫోన్ నెంబర్‌ను తమకు పంపిస్తే నమోదు చేయిస్తామని తెలిపారు. వివరాలకు 9492348428 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

ఇప్పటివరకు 2,43,903 ఓటర్లు నమోదు

ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లుగా ఎవరైనా నమోదు చేసుకోకుంటే ఈ నెల 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని జిల్లా అధికారులు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నమోదు కాపాడిన ఓటర్ల వివరాలను బుధవారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. ఈ గణాంకాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాలోని 57 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 32351, మహిళలు 13764, ట్రాన్స్ జెండర్లు 4 మొత్తంగా 46119 మంది నమోదు చేసుకున్నారు. విజయనగరం జిల్లాకు సంబం ధించి 64 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 35787, మహిళలు 18670, ట్రాన్స్ జెండర్లు 9, మొత్తంగా 54466 మంది నమోదు చేసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి 24 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 11544 , మహిళలు 5507, ట్రాన్స్ జెండర్లు 1 మొత్తంగా 17052 మంది నమోదు చేసుకున్నారు. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 94 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 44805, మహిళలు 35287, ట్రాన్స్ జెండర్లు 37 మొత్తంగా 80105 నమోదు చేసుకున్నారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి 44 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 24231, మహిళలు 11722, ట్రాన్స్ జెండర్లు 8 మొత్తంగా 36061 మంది నమోదు చేసుకున్నారు. అల్లూరి జిల్లాకు సంబంధించి 14 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 7085, మహిళలు 3112, ట్రాన్స్ జెండర్లు 3, మొత్తంగా 10200 నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. మొత్తంగా 297 పోలింగ్ స్టేషన్లుకు గాను పురుషులు 1,55,803, మహిళలు 88,062, ట్రాన్స్ జెండర్లు 38తో కలిపి 2,43,903 మంది నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రజలను చైతన్యం చేయాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న వైటి దాస్

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రజలను చైతన్యం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 650వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలతోనే ఆయా ప్రాంతాల అభివృద్ధి ముడిపడి ఉందని చాటి చెప్పాలని తెలిపారు. నిర్వాసిత కాలనీలలో కమిటీలు వేసి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇటీవల ప్రధాని మోడీ పర్యటన ద్వారా రాష్ట్రంలోని రాజకీయ పార్టీల వైఖరి తేటతెల్లమైందన్నారు. పదవులే పరమావధిగా రాజకీయాలు నడుపు తున్నారని విమర్శించారు. ప్రజలకు మెరుగైన జీవన విధానంపై రాజకీయ పార్టీలు స్పందించక పోవడం దారుణమన్నారు. దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ మంత్రి రాజశేఖర్, వైటి.దాస్, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, విల్లా రామ్మోహన్‌కుమార్, మసేనురావు, చంద్రరావు, డి.నర్సింగరావు, డివి.రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు, పరంధామయ్య, దాలినాయుడు, కొమ్మినేని శ్రీనివాసరావు, నమ్మి అప్పలరాజు, రామ్‌కుమార్ శ్రీనివాసరాజు, కారు రమణ, కోదండరావు శ్రీనివాసనాయుడు, పిట్ట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోడీ స్పందించరా?

కలెక్టరేట్, విశాఖ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 12న విశాఖ వచ్చిన ప్రధాని మోడీ పాల్గొన్న సభలో ప్రస్తావించినా మోడీ స్పందించకపోవడం శోచనీయమని హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (వైఎస్ఆర్‌టియు) నాయకుడు టి.తులసీదాస్ పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 601వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం చరిత్రలో 600 రోజులకు పైబడి ఉద్యమం సాగిన సంఘటన లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఇంత సుదీర్ఘకాలం జరుగుతున్న ఉద్యమాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడం దుర్మార్గం అన్నారు. మోడీ ప్రభుత్వ వైఖరి ఎలా ఉన్నప్పటికీ, ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటే అన్ని తరగతుల వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ దీక్షల్లో ఎమ్‌డి యాసిన్, కె.నాగభూషణం, సాయి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉదయశ్రీ

సచివాలయాల్లో పూర్తి స్థాయి సేవలు

ప్రజాశక్తి-నక్కపల్లి: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని డిఎల్‌పిఓ ఉదయశ్రీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాలంటీర్ల సర్వే, ఆధార్ సెంటర్‌లు, సచివాలయ ఉద్యోగుల పనితీరు, సచివాలయం సేవలు, హౌసింగ్ నిర్మాణాలు, ప్రభుత్వ భవనాలపై ఆరా తీశారు. ఎంపీడీవో సీతారామరాజు ఇందుకు సంబంధించిన వివరాలను ఆమెకు తెలియజేశారు. అనంతరు ఆమె దోసలపాడు, రేబాక సచివాలయాలను సందర్శించారు. వాలంటీర్ల సర్వే, ఆధార్ నమోదును పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, అప్పలరాజు, కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఉషారాణి

మెనూ అమలు చేయకుంటే చర్యలు

సిడిపిఒ ఉషారాణి

ప్రజాశక్తి-కొత్తకోట: అంగన్వాడీ కేంద్రాలలో మెనూ అమలు పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రావికమతం ఐసిడిఎస్ సిడిపివో ఉషారాణి అన్నారు. బుధవారం ఆమె కొత్తకోట సెక్టార్ పరిధి గాంధీ నగర్‌లో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ పరిధిలో గర్భిణీ, బాలింత, కిషోర్ బాలికలు, చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. మెనూ అమలులో ఆశ్రద్ధ వహించినా, పిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న గుడ్లు, బాలామృతం, వైఎస్ఆర్ కిట్లు, తదితర సరుకులు పంపిణి పారదర్శకంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సమయ పాలన ఉండాలన్నారు. సెలవు దినాల్లో మినహా కేంద్రాలను తెరవకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి నిల్వలను తనిఖీ చేశారు. ఆమె వెంట సెక్టార్ సూపర్ వైజర్ విజయ, అంగన్వాడీ కార్యకర్త జానికి ఉన్నారు.



పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న జిలానీ, అన్వర్

ఆర్‌డిఒకు అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి జయరామ్‌ను ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సమాచార హక్కు చట్టం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జీలానీ, మండల అధ్యక్షులు అన్వర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆకట్టుకున్న పోస్టల్ స్టాంప్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్ర విభజన తర్వాత పోస్టల్ శాఖ తొలిసారిగా పోస్టల్ స్టాంప్స్ ప్రదర్శనను విశాఖలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. నగరంలోని రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో విశాఖ పోస్టల్ రీజియన్ నేతృత్వంలో మూడు రోజుల పాటు ఏర్పాటుచేసిన పోస్టల్ స్టాంప్స్ ఎగ్జిబిషన్ ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ 8 సంవత్సరాల తర్వాత ఏర్పాటు చేసిన 13వ రాష్ట్ర స్థాయి ఫిలా ఎగ్జిబిషన్ ఎఫెక్స్ 2022లో 5700 పురాతన స్టాంప్‌లను, 337 ఫ్రైమ్ల ద్వారా ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. ప్రత్యేక పోస్టల్ కవర్లు సేకరించే 109 మంది ఫిలాటెలిస్టులు వారి, వారి కలక్షన్స్‌ను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడం హర్షించదగిన విషయం అన్నారు. పోస్టల్ స్టాంప్స్ సేకరణ మంచి హాబీ అని, పిల్లలు అలవర్చుకోవాలని సూచించారు. విశిష్ట అతిథి హెచ్‌పిసిఎల్ సీనియర్ మేనేజర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆయా రంగాల్లో నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్టు మాస్టర్ జనరల్ డిఎస్.విజరూర్తి, పోస్టల్ సర్వీస్ డైరెక్టర్లు జగదీష్ పాయ్, ఆదిత్య నాయక్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అకౌంట్స్ డైరెక్టర్ రోజా మేరీ పాల్గొన్నారు.



ప్రమాదంలో గాయపడ్డ కెవిపిఎస్ విశాఖ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్నను కూర్మన్నపాలెంలోని అతని ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె లోకనాథం

పలు రైళ్ల రద్దు, రీషెడ్యూలింగ్

ప్రజాశక్తి ఎంవిపి కాలనీ : భద్రక్ - కపిలాస్ రోడ్ సెక్షన్‌లోని కొరేయి స్టేషన్ సమీపంలో ఖాళీ గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా, పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. 22842 తాంబరం - సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 23న రద్దు చేశారు. 12864 ఎస్ఎంవి బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 10.35 గంటలకు బదులుగా 12.00 గంటలకు రీ షెడ్యూల్ చేసింది.

అమరావతి రాజధానిగా ఉండాలి

సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించిన విధంగా అమరావతి ఒకటే రాజధానిగా ఉండాలని, ఆ తీర్మానం మేరకు ప్రభుత్వం ముందుకు వెళ్లాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జెఎసి ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 'ఒకటే రాజధాని అమరావతి, 26 జిల్లాల అభివృద్ధి వికేంద్రీకరణ' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నిర్ణయాలు మారుతాయా అని ప్రశ్నించారు. ఒక ప్రాంతం అభివృద్ధి భవనాల నిర్మాణంతోనే సరిపోదన్నారు. తమిళనాడు, మహారాష్ట్ర తరహాలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతిలో హైకోర్టు ప్రిన్సిపల్ బెంచ్‌ని ఉంచి, కర్నూలు, విశాఖపట్నంలో బెంచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం పోరాటం చేయాలన్నారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని జెఎసి చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా అభివృద్ధి కోసం బ్లూ ప్రింట్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ దండి ప్రియాంకరావు, కో-కన్వీనర్ జగన్ మురారి, ఎపి నిరుద్యోగ జెఎసి అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ పాల్గొన్నారు.